# సార్ బాటలోనే సాగుతాం

- అందరినీ ఏకతాటిపైకి తెచ్చిన గొప్ప వ్యక్తి
- పాఠ్యాంశంగా ఆయన జీవిత చరిత్ర
- జయశంకర్ సార్ జయంతి ఉత్సవాల్లో మంత్రి కేటీఆర్
- తెలంగాణకు దశ, దిశ చూపిన ప్రొఫెసర్ జయశంకర్: టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి



ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా అగ్రికల్చర్ యూనివర్సిటీలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో వీసీ ప్రవీణ్‌రావు, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలంగాణ ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్ చూపిన బాట, నేర్పిన మాటలతోనే తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారక రామారావు అన్నారు. జయశంకర్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్పించేందుకు తమ ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శనివారం ప్రొఫెసర్ జయశంకర్ 82వ జయంతి ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరయిన ఆయన తొలుత జయశంకర్ సార్ విగ్రహానికి పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ప్రవీణ్‌రావుతో కలిసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ, వైవిధ్యమైన వ్యక్తులు, సంస్థలను తెలంగాణ రాష్ట్ర సాధనలో ఏకతాటిపైకి తెచ్చిన గొప్ప వ్యక్తి ఆచార్య జయశంకర్ అని అన్నారు. కుదిరితే కలిసి పనిచేద్దాం, కుదరకపోతే సమాంతరంగా పనిచేద్దామన్న స్ఫూర్తిని నింపిన మహనీయుడన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలిపే బాధ్యత మనందరిపై ఉందని మంత్రి కేటీఆర్ సూచించారు. తెలంగాణకు దశ, దిశ చూపిన వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి అన్నారు. ఆయన అందించిన స్ఫూర్తితో తెలంగాణ ప్రజలంతా ఉద్యమంలో పాల్గొన్నారని చెప్పారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత వివిధ విభాగాల్లో 5106 ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. మరికొన్ని ఉద్యోగాల నియామకానికి సంబంధించి తమకు ప్రతిపాదనలు అందాయన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఘంటా చక్రపాణి, ప్రవీణ్‌రావు బహుమతులు ప్రదానం చేశారు. పన్నెండుసార్లు రక్తదానం, రెండు రక్తదాన శిబిరాలు నిర్వహించిన పీజీ విద్యార్థి రాయనేని శ్రీనివాస్‌కు ప్రత్యేక ప్రశంసాపత్రం, అవార్డును అందజేశారు. వరంగల్‌కు చెందిన ఎనిమిదేండ్ల అర్జున్.. జయశంకర్ సార్ జీవిత విశేషాలను వివరించడం అందరినీ ఆకట్టుకుంది. అంతకుముందు విశ్వవిద్యాలయం సీనియర్ ఆర్టిస్ట్ కమ్ ఫొటోగ్రాఫర్ రూపస్.. విత్తనాలతో రూపొందించిన ప్రొఫెసర్ జయశంకర్ సార్ చిత్రపటాన్ని కేటీఆర్ ఆవిష్కరించారు.

## ఉద్యాన విశ్వవిద్యాలయంలో 85 ప్రొఫెసర్ పోస్టుల భర్తీ

శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయంలో త్వరలోనే 85 ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయనున్నట్టు వ్యవసాయశాఖ కార్యదర్శి సీ పార్థసారథి తెలిపారు. రైతులకు సాంకేతిక సలహాలు అందించేందుకు వెయ్యి ఏఈవో పోస్టుల భర్తీ ప్రక్రియ త్వరలోనే పూర్తవుతుందన్నారు.